క్లుప్తంగా

ఇబ్రహీంపట్నంలో వన భోజనాలు



ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డితో లింగబలిజ సంఘం సభ్యులు

ఇబ్రహీంపట్నం: వీరశైవ లింగాయత్ లింగబలిజ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వన భోజనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణ సమీపంలోని శ్రీ భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజల అనంతరం వన భోజనాలను ఏర్పాటు చేశారు. పిల్లలు, పెద్దలు ఎంతో ఉత్సాహంగా ఆటల్లో పాల్గొన్నారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శెట్టి శివకుమార్, జిల్లా అధ్యక్షుడు పట్నంశెట్టి విశ్వనాథ్, కార్యదర్శి మాయిని ఆనందప్ప ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ఎంపీపీ కృపేశ్, కౌన్సిలర్ నీలం శ్వేత, ఏఎంసీ డైరెక్టర్ కిరణప్పతో పాటు ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దినేష్ పాటిల్, రాజశేఖర్, సోమేశ్వర్, అనిల్, ఈశ్వర ప్రసాద్, సిద్దప్ప, రవి, శేఖరప్ప, రాజ్‌కుమార్, ప్రభు, మహేశ్, మహిళలు, పిల్లలు హాజరయ్యారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి

మంత్రి సబితారెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనే రాష్ట్రానికి శ్రీరామ రక్ష అని విద్యాశాఖ మంత్రి, బీఆర్‌ఎస్ మహేశ్వరం ఎమ్మెల్యే అభ్యర్థి సబితారెడ్డి పేర్కొన్నారు. ఆర్‌కేపురం డివిజన్‌లోని హరిపురి కాలనీకి చెందిన పలువురు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ ఆధ్వర్యంలో మంత్రి సబితారెడ్డి సమక్షంలో ఆదివారం బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి మంత్రి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పదేళ్లలో ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన అభివృద్ధిని చూసి ఇతర పార్టీల నాయకులు పెద్ద ఎత్తున బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారన్నారు. నియోజకవర్గంలో నిరంతర అభివృద్ధి కొనసాగాలంటే మరోసారి తనని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, బాబాగౌడ్, సాగర్, అనిల్, మహ్మద్ అజీమ్, హజారుద్దీన్, అబ్దుల్‌నాది, యూసుఫ్‌పాషా, చంద్రారెడ్డి, రవీందర్, ఆదిత్య, వంశీ, మహమ్మద్‌రఫీ పాల్గొన్నారు.

ఇంటి నుంచే ఓటు వేసేందుకు చర్యలు

ఎల్‌బీనగర్: 80 సంవత్సరాలు దాటిన వారు ఇంటి నుంచే ఓటు వేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఎల్‌బీనగర్ ఎన్నికల అధికారులు తెలిపారు. ఇప్పటికే నియోజక వర్గంలో 80 ఏళ్లు దాటిన వయోవృద్ధులు, వికలాంగులు ఇంటి నుంచే ఓటు వేసేందుకు 12డీ ఫారాలను పంపిణీ చేశారు. వాటిని స్వీకరించేందుకు ఏర్పాటు చేసిన ఎన్నికల సిబ్బందితో ఆదివారం ఎన్నికల అధికారులు సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, 12డీ ఫారంలను స్వీకరించేందుకూ 47 టీంలను ఏర్పాటు చేశామన్నారు. ఈ అవకాశాన్ని వయోవృద్ధులు, వికలాంగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రెండు రోజులు పాటు జరిగే ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొని వారికి అవగాహన కలిపిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఈఆర్‌ఓ రవీందర్‌కుమార్, ఏఆర్‌లు సునీత, నరేష్‌కుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభంజనం ప్రారంభమైంది



ఆమనగల్లు: కసిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

- కసిరెడ్డి నారాయణరెడ్డి
- గ్రామాల్లో నేతల విస్తృత ప్రచారం

ఆమనగల్లు: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభంజనం ప్రారంభమైందని.. ఆ ప్రభంజనంలో బీఆర్‌ఎస్, బీజేపీలు కొట్టుకుపోవడం ఖాయమని కల్వకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కడ్తాల మండలం గోవిందాయిపల్లి తండా, వాస్‌దేవ్‌పూర్, నేరెల్లకుంట తండా, చెన్నారం తండా, రాజీవ్‌నగర్ తండా, బాలాజీనగర్ తండా, కాద్యతండాలో ఆదివారం కసిరెడ్డి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఆయా తాండాల్లో కసిరెడ్డి నారాయణరెడ్డికి.. కాంగ్రెస్ నాయకులు, మహిళలు ఘన స్వాగతం పలికారు. కసిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని దీమా వ్యక్తంచేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేతలు.. బాలాజీసింగ్, సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి, అయిల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్ రెడ్డి, కడ్తాల ఎంపీపీ కమ్లీ మోత్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బిచ్యానాయక్, నాయకులు జహంగీర్ బాబా, వెంకటేశ్, రాములు, హీరాసింగ్, జైపాల్ నాయక్ తదితరులు ఉన్నారు. అలాగే ఆమనగల్లు పట్టణంలో కసిరెడ్డికి మద్దతుగా కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జంగయ్య, కేశవులు, మానయ్య, కృష్ణనాయక్, మల్లేశ్‌నాయక్, ఖాదర్, ఖరీం, కాలె మల్లయ్య, ఖాదర్‌ఖాద్రి, జలాల్, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, యాదయ్య, శివలింగం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

ఆమనగల్లు: కడ్తాల మండలం చరికొండ ఎంపీటీసీ



ఆమనగల్లు: ప్రచారంలో కసిరెడ్డి నారాయణరెడ్డి

సభ్యుడు అద్దాల రాములు, పలువురు నాయకులు.. కాంగ్రెస్ నేత మహేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో కసిరెడ్డి, నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. తలకొండపల్లి మండలం ఖానాపూర్‌లో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో వారి హస్తం గూటికి చేశారు. కాంగ్రెస్‌లో చేరినవారిలో వివేకానంద యూత్ సభ్యులు ఈశ్వర్ యాదవ్, నరేందర్, నర్సింగ్, శ్రీశైలం, రవి, శ్రీను, మహేశ్, గిరి, రాజేశ్, వెంకటేశ్, మహేశ్ తదితరులు ఉన్నారు. కడ్తాలలో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

వంశీధర్‌రెడ్డి ప్రచారం..

ఆమనగల్లు: కల్వకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డికి మద్దతుగా ఆయన కుమారుడు కృష్ణవంశీధర్ రెడ్డి ఆదివారం తలకొండపల్లి మండలం వెంకట్రావ్‌పేటలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్‌తోనే సమన్యాయం సాధ్యమన్నారు. ఆరు గ్యారంటీలపై విస్తృత ప్రచారం చేపట్టారు. హస్తం గుర్తుకు ఓటువేసి తన తండ్రిని గెలిపించాలని ఓటర్లను కోరారు.

'క్యామ' క్షమాపణలు చెప్పాలి

ఆరుట్లలో దళిత సంఘాల నిరసన

మంచాల: బీఆర్‌ఎస్ నేత క్యామ మల్లేశ్ దళితులను కించపర్చే విధంగా మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని దళిత సంఘాల నాయకులు అన్నారు. మల్లేశ్ వాఖ్యలకు నిరసనగా ఆదివారం ఆరుట్ల చౌరస్తాలో వారు ఆందోళన చేపట్టారు. ఈ సందర్బంగా దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ.. ఆరుట్లలో దళితులు గడ్డి వాములు దగ్ధం చేశారు, ఎడ్లను కోశారు, బోరుమోటార్లు కాల్చివేశారు అంటూ అరచాక వాదులుగా కించపర్చే విధంగా క్యామ మల్లేశ్ మాట్లాడారని ఆరోపించారు. ఆరుట్ల గ్రామ గత చరిత్ర, గతంలో జరిగిన సంఘటనల గురించి తెలుసుకోకుండా అనుచిత వాఖ్యలు చేయడం సరైందికాదన్నారు. ఆరుట్లలో 17వేల ఎకరాలకు పైగా భూములు దొరల చేతిలో ఉండేవన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం అలుపెరుగని భూపోరాటాలు చేసిన కామ్రేడ్ అనంగళ్ల దానయ్య, పోచయ్యను ఇక్కడి భూస్వాములు అత్యంత కిరాతకంగా చంపిన సంఘటన క్యామ మల్లేశ్ తెలుసుకోవాలన్నారు. దళితులపై జరిగిన దాడుల గూరించి మాట్లాడకుండా వారిని అరాచకవాదులుగా ముద్రవేసే చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వెంటనే క్యామ మల్లేశ్ దళితులకు బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. లేని పక్షంలో క్యామను గ్రామాల్లో తిరగనివ్వమన్నారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు కంభాలపల్లి భాస్కర్, అనంగళ్ల యాదయ్య, కృష్ణ,నర్సింహ, భాస్కర్, హరిప్రసాద్, ఎల్లేష్, క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఆరుట్లలో నిరసన తెలుపుతున్న దళిత సంఘాల నాయకులు

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి: సీఐ

యాచారం: మండల పరిధిలో అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేలా రాజకీయ పక్షాల నాయకులు సహకరించాలని యాచారం సీఐ సైదయ్య కోరారు. ఆదివారం ఆయన యాచారం పీఎస్‌లో మాట్లాడుతూ.. గ్రామాల్లో నింబంధనల ప్రకారమే ప్రచారాన్ని చేసుకోవాలని.. ప్రజలకు ఏం ఇబ్బంది కలిగించరాదని అన్నారు. నింబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యానగర్ సంక్షేమ సంఘం ఎన్నిక



సంక్షేమ సంఘం సభ్యులను సత్కరించిన కాలనీవాసులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని విద్యానగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా 3వసారి ఎం ఏ.పాష ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విద్యానగర్ కాలనీలోని లిటిల్ స్కాలర్స్ టెక్నో హైస్కూల్ ఆవరణలో ఆదివారం విద్యానగర్ కాలనీ సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించారు. సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎంఏ.పాషా, ఉపాధ్యక్షుడిగా వర్కాల శేఖర్, ప్రధాన కార్యదర్శిగా జంగయ్య, కోశాధికారిగా సుదర్శన్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా వెంకటేశ్వర్‌రెడ్డి, సత్యానారయణ, సలహాదారులుగా పత్యానాయక్, పాండునాయక్, కార్యవర్గ సభ్యులుగా పర్వతాలు, ఆరీఫ్, రాములు, ఆనంద్, యాదగిరి, బాబు, సత్యం, విష్ణు, మధు తదితరులను ఎన్నుకున్నారు. అంతకుముందు జరిగిన సమావేశంలో విద్యానగర్ కాలనీకి సంబంధించిన సర్వే నంబర్ నిషేధ జాబితాలో ఉండగా ఇటీవల ఈ కాలనీని తొలగించారు. దీంతో కాలనీలో ప్లాట్ల విక్రయాలు, ఇళ్ల నిర్మాణానికి అనుమతులు లభించనున్నాయి. ఈ నేపథ్యంలో నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు కృషిచేసిన కాలనీ సంక్షేమ సంఘం కమిటీ సభ్యులను ఘనంగా సత్కరించారు.

అభ్యర్థిని చూసి ఓటు వేయండి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జైభారత్ సభ్యులు

జైభారత్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి రాజు

ఆమనగల్లు: నోటుకు ఓటును అమ్ముకుంటే ఐదేళ్ల భవిష్యత్తు అధోగతి అవుతుందని జైభారత్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి రాజు అన్నారు. ఆమనగల్లు పట్టణంలో జైభారత్ ఆధ్వర్యంలో డబ్బుకు ఓటు అమ్ముకుంటే బతికున్నా శవంతో సమానం అంటూ ముద్రించిన పోస్టర్లను ఆదివారం స్థానిక నాయకులతో కలిసి రాజు ఆవిష్కరించారు. రాజు మాట్లాడుతూ.. ఎన్నికల్లో రాజకీయ నాయకులు చూపే డబ్బుకు ఆశపడితే మోసపోవడం ఖాయమని అన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా పోటీచేసే అభ్యర్థుల నైతిక ప్రవర్తన, అర్హత, సమర్థత, నిబద్ధతను చూసి ఓటు వేయాలని సూచించారు. మీ స్థానిక సమస్యలపై పూర్తి అవగాహన ఉండి వాటిని పరిష్కరిస్తా అని హామీ ఇచ్చే నాయకుడినే ఎన్నుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జైభారత్ మండల శాఖ అధ్యక్షుడు జహంగీర్, స్థానిక నాయకులు సురేందర్, ఇస్మాయిల్, రాజు, మహ్మద్ పాషా, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పథకాల ఘనత మాదే



మంచాల: బహిరంగ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

మంచాల: బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి అన్నారు. ఆరుట్లలో ఆదివారం నిర్వహించిన బహిరంగ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిందన్నారు. అన్నివర్గాల ప్రజలకు అపన్నహస్తంగా బీఆర్‌ఎస్ మారిందన్నారు. నగరానికి కూతవేటు దూరంలో ఉన్న ఇబ్రహీంపట్నం గతంలో కరువు ప్రాంతంగా పిలిచే వారని పేర్కొన్నారు. నేడు అన్ని రంగాల్లో ముందుకు పోతుందన్నారు. ప్రపంచ స్థాయి గుర్తింపు పొందిన పరిశ్రమలు ఇక్కడకు వచ్చాయన్నారు. అన్ని గ్రామాలకు, తండాలకు బీటీ రోడ్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పల్లె ప్రకృతి వనాలు, రోడ్లకు ఇరువైపులా చెట్లు నాటడంతో పచ్చదనంతో పల్లెలు కళకళలాడుతున్నాయన్నారు. కారు గుర్తుపై ఓటు వేసి బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని బలపర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేశ్, మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్ రెడ్డి, దండెం రాంరెడ్డి, ఎంపీపీ నర్మద, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, పీఏసీఎస్ చైర్మన్ పుల్లారెడ్డి, మాజీ చైర్మన్ సికిందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమేష్, పున్నం రాము, జానీపాష, రఘుపతి, శేఖర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం: ప్రచారంలో మౌనికాప్రశాంత్‌రెడ్డి

అభివృద్ధిని చూసి ఓటెయ్యండి..

ఇబ్రహీంపట్నం: అభివృద్ధి పనులను చూసి ఓటేయాలని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి కోడలు మంచిరెడ్డి మౌనికా ప్రశాంత్‌రెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. ఆదివారం ఇబ్రహీంపట్నంలోని పలువార్డుల్లో మామ కిషన్‌రెడ్డిని గెలిపించాలని ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి, అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తుందన్నారు. తన మామ కిషన్‌రెడ్డి నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను దృష్టిలో పెట్టుకొని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఇంటింటి ప్రచారం

చాదర్‌ఘాట్: తెలంగాణ ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఆదరణతో మలక్‌పేటలో బీఆర్‌ఎస్ పార్టీ విజయం ఖాయమని పార్టీ మలక్‌పేట అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం ఓల్డ్‌మలక్‌పేట డివిజన్‌లో ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కామేష్, నర్సింగ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఖాయం



కేఎల్‌ఆర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

- ప్రతిపక్షాలను చిత్తుగా ఓడిస్తాం
- కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి
- పార్టీలో పలువురి చేరికలు

మహేశ్వరం: మహేశ్వరంలో కాంగ్రెస్ గెలుపును ఎవరూ ఆపలేరని మహేశ్వరం ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని మెహబ్బత్‌నగర్ గ్రామానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు స్థానిక సీనియర్ నాయకుడు శివయాదవ్ ఆధ్వర్యంలో కేఎల్లార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో గెలుపొంది మంత్రి పదవి కోసం కన్నతల్లి లాంటి పార్టీని మోసం చేసి బీఆర్‌ఎస్‌లో చేరిన సబితారెడ్డి, కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టే బీజేపీలను చిత్తుగా ఓడిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందని నాయకులు మాత్రమే పార్టీని వీడారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి మహిళ ఖాతాల్లో మహాలక్ష్మి పథకం కింద రూ.2500 వేస్తుందన్నారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు పింఛన్ రూ.4 వేలకు పెంచుతామన్నారు. మహేశ్వరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. ముందుగా మెహబ్బత్ నగర్ గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు పాపానాయక్, రమేష్, శేఖర్, బుజ్జమ్మ, వినోద్ తదితరులు కాంగ్రెస్‌లో చేరారు.

ఇంటింటి ప్రచారం

మహేశ్వరం గడ్డపైన కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కాకి ఈశ్వర్ ముదిరాజ్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రం, అమీర్‌పేట్, కోళ్లపడకల్, నందుపల్లి గ్రామాల్లో కాంగ్రెస్‌కు మద్దతుగా హస్తం గుర్తుకు ఓటు వేయాలని ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహేశ్వరంలో కాంగ్రెస్ అభ్యర్థి కేఎల్లార్ భారీ మెజార్టీతో గెలుపు ఖాయమన్నారు. అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు యాదయ్య, కుమార్, ప్రవీణ్, చంద్రమోహన్, శ్రీకాంత్, రాజేందర్, పాండు, ప్రవీణ్, ఆనంద్, నర్సింహ, భిక్షపతి, జంగయ్య పలువురు పాల్గొన్నారు.

కేఎల్‌ఆర్‌ను గెలిపిద్దాం..

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడలో కాంగ్రెస్ అభ్యర్థి కేఎల్లార్‌ను గెలిపించాలని నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ చిగురింత నర్సింహారెడ్డి, నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. చేయి గుర్తుకు ఓటు వేసి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహేశ్వరం గడ్డ మీద ఎగరబోయేది కాంగ్రెస్ జెండానే అని అన్నారు. కాంగ్రెస్ వస్తే ఆరు గ్యారంటీల అమలుతో పాటు పేదల ఆడబిడ్డల పెళ్లిలకు రూ.లక్షతో పాటు తులం బంగారం ఇస్తామన్నారు. రైతులకు, కౌలు రైతులకు ఆర్థిక సాయంతో పాటు నిరుద్యోగులకు జాబ్ గ్యారంటీ పథకం అమలు చేస్తామన్నారు.

అధికారంలోకి రాగానే గ్యారెంటీలు..

దిల్‌సుఖ్‌నగర్: కాంగ్రెస్ పార్టీ అధికారం రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందని ఆ పార్టీ ఆర్‌కేపురం డివిజన్ సీనియర్ నాయకురాలు తమలపాకుల హర్షలత పేర్కొన్నారు. ఆదివారం మహేశ్వరం కాంగ్రెస్ అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డిని గెలిపించాలని కోరుతూ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. సోనియా గాంధీ మాట ఇచ్చారంటే అమలు చేసి తీరుతారన్నారు. కర్ణాటకలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే చేశారన్నారు. కేఎల్లాఆర్‌కు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో శకుంతల, శిరీష చౌదరి, నిర్మలారెడ్డి, నీలిమ, ఉషారాణి, బాలమణి, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి చేరిక..

కందుకూరు: మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరారు. యూత్ నాయకుడు సొడవు వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో దాసర్లపల్లి, నేదునూరు, చిప్పలపల్లి గ్రామాల నుంచి యువకులు కేఎల్లార్ కుమారుడు అనురూప్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్బంగా కాంగ్రెస్ విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, సిద్దేశ్వర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, నవీన్, సాయి, శ్రీను, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా వరికోతలు

- కూలీల కొరతతో యంత్రాలకు డిమాండ్
- జాడలేని కొనుగోలు కేంద్రాలు
- తక్కువ ధరకే దళారుల కొనుగోలు
- పెట్టుబడి వెళ్లడంలేదంటున్న రైతన్నలు



చింతపట్లలో యంత్రంతో వరికోత, (ఇన్‌సెట్‌లో) నిల్వపోసిన ధాన్యం

యాచారం: ఇబ్రహీంపట్నం డివిజన్ పరిధిలో వరికోత పనులు జోరుగా సాగుతున్నాయి. రెండేళ్ల కింద కురిసిన సంవృద్ధి వర్షాలతో ఆయా గ్రామాల్లో చెరువులు, కుంటలు నిండి భూగర్భజలాలకు కొదువలేదు. వానాకాలం కింద ఈ యేడాది డివిజన్‌లోని ఇబ్రహీంపట్నం, యాచారం, మంచాల, అబ్దుల్లాపూర్‌మెట్ తదితర మండలాల్లో 25వేల ఎకరాలకు పైగా వరిపంటను సాగు చేశారు. చెరువులు, కుంటలు నిండి ఉండటంతో బోరుబావుల్లో పుష్కలంగా నీళ్లుండి వరిపంటకు సరిపడా నీరు అందింది. విద్యుత్ సరఫరాలో అంతరాయం కూడా లేకపోవడంతో సాగులో రైతులకు ఇబ్బందుల్లేవు. వరిపంట కూడా మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ఇబ్రహీంపట్నం మండలంలోని రాయపోల్, దండుమైలారం, ముకునూర్, పోల్కంపల్లి, మంచాల మండలంలో మంచాల, ఆరుట్ల, జాపాల, లోయపల్లి, ఎల్లమ్మతండా, బోడకొండ, రంగాపూర్, యాచారం మండలంలోని గునుగల్, చింతపట్ల, నల్లవెల్లి, మంతన్‌గౌరెల్లి, మాల్ తదితర గ్రామాల్లోని రైతులు వరిపంటను అత్యధిక ఎకరాల్లో సాగు చేశారు. అలాగే మిగితా గ్రామాల్లో కూడా పత్తి పంటను సాగు చేశారు. డివిజన్‌లోని పలు గ్రామాల్లో పక్షం రోజులుగా వరికోత పనులు జోరుగా సాగుతున్నాయి. కలాల్లో వరిధాన్యం రాసులు కుప్పలు, కుప్పలుగా ఉన్నాయి.

యంత్రాలతోనే వరికోతలు

గ్రామాల్లో వరిపంటను కోయడానికి కూలీల సమస్య తీవ్రంగా ఉంది. ఎన్నికల ప్రచారాలు జోరందుకోవడంతో కూలిలెవ్వరూ వరికోత పనులకు వెళ్లడం లేదు. పంట చేతికి రావడం, ఆలస్యం చేస్తే వరి గింజలు నేలరాలిపోయే అవకాశం ఉండటంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. దీంతో రైతులు నల్లగొండ, మిర్యాలగూడ, దేవరకొండ, కల్వకుర్తి తదితర ప్రాంతాల్లో ఉన్న వరికోత యంత్రాలను తెప్పించి పంటను కోయిస్తున్నారు. అన్ని గ్రామాల్లో వరిపంట చేతికిరావడం, ఆలస్యం చేస్తే గింజలు రాలి నష్టపోయే అవకాశం ఉన్న నేపథ్యంలో డిమాండ్ దృష్ట్యా వరికోత యంత్రాల యజమానులు రేట్లను అమాంతం పెంచేశారు. గతేడాది గంటకు 1,500 మాత్రమే ఉండగా ఈ ఏడాది గంటకు రూ.2,500 నుంచి రూ.3వేలకు పైగానే రేట్లు పెంచారు. డీజిల్ రేట్లు, యంత్రాలు నడిపే డ్రైవర్ల జీతాలు కూడా పెరగడంతో కోతకు రేట్లను పెంచక తప్పడం లేదని యజమానులు అంటున్నారు. రైతులు మాత్రం ఎకరా వరిపంట సాగు కోసం రూ.25 వేలకు పైగానే ఖర్చు చేస్తున్నామని, తీరా పంట చేతికొచ్చాక కోత సమయంలో మరింత ఇబ్బంది ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దళారుల పాలు

వరికోత పనులు జోరందుకున్నా అధికారులు మాత్రం ధాన్యం కొనుగోలు కేంద్రాలను పూర్తిస్థాయిలో ప్రారంభించకపోవడం రైతులకు శాపంగా మారింది. వరిధాన్యానికి ప్రభుత్వం క్వింటాల్ ఏ-గ్రేడ్‌కు రూ.2,203, సాధారాణ గ్రేడ్‌కు రూ.2,183గా మద్దతు ధర నిర్ధారించింది. వరికోత పనులు ప్రారంభమైన వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తే రైతులు వెంటనే కేంద్రాలకు ధాన్యాన్ని తరలించి విక్రయించే అవకాశం ఉంది. కాని ఇబ్రహీంపట్నం డివిజన్‌లో 14 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించే అవకాశం ఉండగా నేటికి కేవలం 8 చోట్ల మాత్రమే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ప్రారంభించిన చోట్ల కూడా సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్ల రైతులెవరూ తాము పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకరావడం లేదు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో వేలాది క్వింటాళ్ల ధాన్యం దళారుల చేతుల్లోకి వెళ్లిపోయింది. క్వింటాల్‌కు రూ.1,550 నుంచి రూ.1,800 వరకే చెల్లిస్తు వ్యవసాయ పొలాల వద్దకు వెళ్తున్న దళారులు నేరుగా లారీలు నింపుకుని వెళ్తున్నారు. దళారులు తక్షణమే డబ్బులు ఇవ్వడం వల్ల కూడా రైతులు వారికి ధాన్యం ఇచ్చేందుకు మొగ్గుచూపుతున్నారు. దీనికితోడు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో నాణ్యత, తరుగు పేరుతో ఇబ్బందులు పెడుతుండటం కూడా రైతులు దళారులకు ధాన్యం అమ్మడానికి మరో కారణంగా చెప్పవచ్చు.

కూలీల సమస్య ఉంది



రూ.60వేలకు పైగా ఖర్చుచేసి మూడున్నర ఎకరాలకు పైగా వరిపంట సాగు చేశాను. ప్రస్తుతం వరిపంట చేతికొచ్చింది. కూలీల సమస్యతో గంటకు రూ.2,500 చొప్పున చెల్లించి వరిపంట కోసే యంత్రాలతో కోయించాను. అమ్మడానికి వెళ్తే పెట్టుబడి, కూలీల ఖర్చులకే సరిపోతున్నాయి. కష్టమంతా వృథా అయ్యింది.

– వెంకట్‌రెడ్డి, రైతు, చింతపట్ల

రైతుల బాధ చూడలేకపోతున్నాం



డీజిల్, యంత్రాలు నడిపే సిబ్బంది జీతాలు, ఈఎంఐలు చెల్లించే విషయంలో ఇబ్బందిగా మారుతుంది. అందుకే గంటకు రూ.2,500 చొప్పున తీసుకుంటున్నాం. కొన్నిచోట్ల రైతుల బాధలు చూడలేకపోతున్నాం. వరికోతలు జోరుగా సాగుతుండటంతో కొంతవరకు ఆర్థిక సమస్యలు తగ్గాయి. వరికోతలు లేని సమయంలో యంత్రాన్ని ఇంటివద్ద ఉంచి ఈఎంఐలు చెల్లించాల్సి వస్తుంది.

– గోవర్ధన్‌రెడ్డి, వరికోత యంత్రం యజమాని

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి



రైతులు ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి. దళారులకు విక్రయించి నష్టపోవద్దు.డివిజన్‌లో ఇప్పటికే ఎనిమిది చోట్ల కేంద్రాలను ప్రారంభించాం. త్వరలో అన్నిచోట్ల ప్రారంభిస్తాం. రైతులు ధాన్యాన్ని బాగా ఎండబెట్టి తీసుకురావాలి. విక్రయించిన కొద్ది రోజుల్లో డబ్బులు రైతుల ఖాతాల్లో జమచేస్తాం.

– సత్యనారాయణ, ఏడీఏ, ఇబ్రహీంపట్నం